క్లుప్తంగా

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర కేబినేట్ విస్తరణలో భాగంగా విద్యాశాఖకు మంత్రిని నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యారంగంలో అనుభవం, సామాజిక న్యాయంపై నిబద్ధత కలిగిన నాయకుడిని మంత్రిగా నియమించాలని కోరారు. గత 15 నెలలుగా ప్రభుత్వం నాయకుడిని నియమించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ శాఖను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో విద్యారంగం నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని, అలాంటి విద్యారంగాన్ని నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి నియామకంతో విద్యావ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సామాజిక, ఆర్థిక అసమానతలను నిర్మూలనకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖకు మంత్రిని నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వృథాగా భగీరథ నీరు



మిషన్ భగీరథ నీటిలో స్నానం చేస్తున్న చిన్నారులు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకులో నుంచి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ట్యాంకు నిండి నీరు గంటల తరబడి వరదలా పారుతున్నా పట్టించుకోకపోవడంతో ట్యాంకు కింద పెద్ద గోతి ఏర్పడింది. దీంతో ఆ గోతిలో నీరు నిండుగా ఉండటంతో చిన్నపిల్లలు స్నానాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగు నీరు వృథా కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భవానిమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన భవానిమాత దేవాలయంలో గత మూడురోజులుగా పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన పూజల్లో బీఆర్ఎస్ యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు మాజీ కౌన్సిలర్ బచ్చలి నర్సింలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నాయకులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డి, గణేష్, నరేందర్, నటరాజ్, అశోక్, విఠల్, దేవేందర్‌యాదవ్, శ్రీనివాస్, అనంతయ్య, చింటూ, శేఖర్, శ్రీనివాస్, జంగయ్య, మహ్మద్‌ఎజాజ్(అడ్డు), అశోక్, మల్లేశ్, నవీన్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

16వ మహాసభలను విజయవంతం చేయండి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: సీపీఐ పార్టీ మండల 16వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ పేజ్–2 వద్ద ఈ నెల 10వ తేదీన పార్టీ మండల 16వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నూతన మండల కమిటీని ఎన్నుకోవటంతో పాటు భవిష్యత్తు పార్టీ కార్యాచరణ ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎం.ప్రభులింగం, సుభాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, సత్యనారాయణ, మక్బుల్ పాల్గొన్నారు.



భైరంపల్లిలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు



వర్షాల కారణంగా నేలపాలవుతున్న చేతికొచ్చిన వరి పంట

అన్నదాత ఆగమాగం

- చేతికొచ్చిన పంట కోయలేక నేలపాలు
- మరోవైపు అదును దాటుతుందని విత్తనాలు నాటేందుకు ఆరాటం
- అయోమయంలో రైతన్నలు

కొందుర్గు: ఈ ఏడాది ఊహించని రీతిలో ముందస్తు వర్షాలు కురవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. సాధారణంగా రోహిణి కార్తెలో అడపా దడపా వర్షాలు కురిస్తే పొలాలు చదును చేసుకొని మృగశిర, ఆరుద్ర కార్తెలలో విత్తనాలు నాటేవారు. కానీ ఈ ఏడాది రోహిణి కార్తెలో కురిసిన అధిక వర్షాల కారణంగా పొలాలు చదును చేయకపోవడంతో ఇంకా పొలాలు విత్తనాలు నాటేందుకు సిద్ధం కాలేదు. మరోవైపు యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలు కూడా కోసి నూర్పిడి చేయడానికి వీలు లేకుండా వర్షాలు పడటంతో ఇంకా కొందరు రైతుల వరి, మొక్కజొన్న పంటలు పొలాల్లోనే ఉన్నాయి. ఇక ఆదివారం మృగశిర కార్తె ప్రారంభమైంది. వర్షాలు సంమృద్ధిగా కురుస్తున్నాయని అదును దాటితే మళ్లీ రాదని పునాస సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు రైతులు పత్తి విత్తనాలు నాటారు. శని, ఆదివారాలు వర్షం కురవడంతో పత్తి విత్తనాలు నాటే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. భైరంపల్లి, ముట్పూర్, రేగడిచిల్కమర్రి గ్రామాల్లో విత్తనాలు నాటారు.

గతేడాది పత్తి, మొక్కజొన్న, వరి పంటల సాగు

షాద్‌నగర్ డివిజన్‌లోని ఫరూఖ్‌నగర్, జిల్లేడ్ చౌదరిగూడ, కేశంపేట, కొందుర్గు, కొత్తూర్, నందిగామ, తలకొండపల్లి మండలాల్లో ప్రధానంగా వరి, జొన్న, మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేస్తారు. ముఖ్యంగా ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో అధికంగా పత్తి, మొక్కజొన్న పంటలను సాగుచేస్తారు. షాద్‌నగర్ డివిజన్‌లో గతేడాది 35 వేల ఎకరాల విస్తీర్ణంలో పత్తి, 46 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సాగుచేశారు. ఇక వరి 45 వేల ఎకరాలు, కంది 10 వేల ఎకరాలు సాగుచేశారు. అదేవిధంగా రాగులు, కొర్ర, సజ్జ, పెసర, మినుము, పొద్దుతిరుగుడు, నువ్వులు, వేరుశనగ, ఆముదం, చెరుకు తదితర పంటలు సాగుచేశారు. ఇలా మొత్తం దాదాపు 1.40 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగుచేశారు.

మొక్కజొన్న సాగు పెరిగే అవకాశం

గతేడాది పత్తిపంటకు చీడపీడల ఉధృతి పెరిగి, పురుగుల మందుల ఖర్చు పెరగడంతో పాటు పత్తి ధర కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఎకరం పత్తి పంటను సాగుచేస్తే 6 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పత్తి ధర క్వింటాల్‌కు రూ.7వేలు దాటలేదు. దీంతో పత్తి సాగుచేసిన రైతులకు పెట్టుబడులకే సరిపోయింది. దీనికి తోడు కూలీల కొరత రైతులను వేధిస్తోంది. దీంతో ఈ ఏడాది మొక్కజొన్న సాగుపెరిగే అవకాశం ఉందని రైతన్నలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం వరి పంటకు క్వింటాల్‌కు రూ.2,360లు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం రూ.500లు బోనస్ ఇవ్వడంతో వరిసాగు పెరిగే అవకాశం ఉంది. మొక్కజొన్న యంత్రాల సాయంతో సాగుచేయడానికి అనుకూలంగా ఉండటంతో పాటు క్వింటాలుకు రూ.2,400లు ప్రకటించడంతో రైతులు మొక్కజొన్న సాగుచేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని క్రిష్టియన్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీవాసులందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు అగ్గనూరు బస్వం, వన్నాడ వెంకటేశ్‌గౌడ్, మురళీమోహన్(అప్పి), ప్రవీణ్, బచ్చలి నరేశ్, రవితేజ, మాధవులు, మధు, ముబారక్ అలీఖాన్, మనీశ్, దిలీప్, అర్జున్, లక్ష్మణ్, శ్రీను, మహబూబ్, కిశోర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవాలు

శంకర్‌పల్లి: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో గత మూడురోజుల నుంచి కొనసాగుతున్న దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు పూర్ణాహుతి, క్షేత్రపాలక బలి, శత కలశాభిషేకం, చక్రతీర్థం, కలశ ఉద్వాసనం, మార్జనం కార్యక్రమాలు తుని తపోవనం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సద్గురు సచ్చిదానంద సరస్వతీ స్వామివారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని, నిత్యం దేవతారాధన చేయాలన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విపంచి శర్మ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించగా.. పట్టణంతో పాటు, చుట్టు పక్కన గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



పూజా కార్యక్రమాల్లో సచ్చిదానంద సరస్వతీ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు

మూడురోజుల పాటు ఆలయంలో సాత ఆత్మలింగం, జూలకంటి వెంకట్‌రెడ్డి కలిసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కానరాని సూచిక బోర్డులు





జాతీయ రహదారిపై చెట్లకొమ్మల మధ్య సూచికబోర్డులు

నందిగామ: వాహనదారులకు ముందస్తు సూచనల కోసం ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు చెట్ల కొమ్మల మధ్యకు చేరిపోయాయి. దీంతో వాహనదారులకు బోర్డులు సక్రమంగా కనపడటం లేదు. మూలమలుపులు, బ్రిడ్జీలు, స్కూల్ జోన్‌లు, హాస్పిటళ్లతో పాటు స్పీడ్ లిమిట్‌ను సూచించే బోర్డులు కనపడకపోవడంతో కొత్తగా ఆ రోడ్డు మీదుగా వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదీ నందిగామ నుంచి చంద్రాయన్‌గూడ వరకు పాత జాతీయ రహదారిపై దుస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్లకొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని పాపిరస్ పోర్ట్ రిసార్ట్స్‌లో ఆదివారం కొత్తూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుకున్న 1998–99 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చదువుకున్న రోజుల్లో గడిపిన బాల్యస్మృతులను గుర్తుచేసుకున్నారు. పరిచయ కార్యక్రమం అనంతరం తమకు చదువు చెప్పిన గురువులు నారాయణ, భిక్షపతి, పద్మను పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మొక్కలు నాటుతున్న నాయకులు

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ సాల్క మ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చౌదరిగూడ ఆర్య సమాజంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు. కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండా ఎగురవేయాలన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ కురుమయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాగంటి మరణం తీరని లోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణం చెందడం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణ ముఖ్య కూడలిలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో మంచి నాయకుడిగా ఎదిగిన మాగంటి గోపీనాథ్ ప్రజలందరి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఒక మంచి నాయకుడిని పార్టీ కోల్పోయిందని, ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.నటరాజ్, నాయకులు మన్నె నారాయణయాదవ్, లక్ష్మణ్ నాయక్, చంద్రశేఖర్, వీరేశం, పల్లె శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, రాఘవేందర్, శరత్‌కృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడికి పరామర్శ



సంజయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ పాత్రికేయుడు సంజయ్‌కుమార్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నడికూడ యాదగిరియాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మార్కెట్‌లో మృగశిర కార్తె సందడి

చేవెళ్ల: మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్ల వెంట చేపల అమ్మకాలు జోరుగా సాగాయి. కార్తె రోజు చేపలు తినాలనే ఆనవాయితీ కొనసాగుతుండటంతో ప్రజలు కొనేందుకు మార్కెట్‌లకు ఎగబడ్డారు. ఇదే అదనుగా ధరలు అమాంతం పెంచేశారు. ధరలతో సంబంధం లేకుండా రెట్టింపు పలికినా కొనేందుకు జనం ఆసక్తి చూపారు. దీంతో మార్కెట్లలో ఎటు చూసినా సందడి కనిపించింది.



చేవెళ్లలో చేపలు కొంటున్న జనం

పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జీ పామెన భీంభరత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రుద్రారం, కొమరబండ, బొబ్బిలిగామ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులకు వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను వచ్చే దసరా పండుగ నాటికి నిర్మించుకొని గృహ ప్రవేశం చేయాలని ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి పేదలను నిలువునా మోసం చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వం అందించే ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రతి గడపకూ తప్పనిసరిగా అందిస్తామని భరోసానిచ్చారు. పేదల అభ్యున్నతి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లు మంజూరు చేయాలన్నదే తమ లక్ష్యమని, ప్రజల మద్దతుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి, దేవాలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మంగలి చెన్నయ్య, నియోజకవర్గ సేవా దళ్ అధ్యక్షుడు తొంట రాంచందర్, యూత్ అధ్యక్షులు సురేందర్, అశ్విణి, స్వరూప, సీనియర్ నాయకులు రవి, సత్యనారాయణ, బుచ్చయ్య, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బాల్‌రాజ్, సుదర్శన్, ప్రభాకర్, చంద్రశేఖర్, రవీందర్, దయాకర్ తదితరులు ఉన్నారు.



కొమరబండలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న భీంభరత్, తదితరులు

వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్, వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మంత్రివర్యులుగా ప్రమాణస్వీకారం చేసిన వాకిటి శ్రీహరి ముదిరాజ్‌ను నగరంలోని ఆయన నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేసి ఆదుకుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలు విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ రాజ్యంతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నీరటి రాజు, కొమరబండ దేవాలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య, ముదిరాజ్ నాయకులు మహేందర్, సాయి, సుబాష్ చంద్రబోస్ తదితరులు ఉన్నారు.



శ్రీహరి ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆత్మరక్షణకు కరాటే దోహదం

చేవెళ్ల: కరాటే ఆత్మరక్షణతో పాటు శారీర దృఢత్వానికి దోహదపడుతుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండల కేంద్రంలోని స్పోర్ట్స్ స్టేడియంలో ఆదివారం జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ కె.కృష్ణ నిర్వహించిన కరాటే శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా కరాటే బెల్టుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులు ప్రదానం చేశారు. అనంతరం శిక్షణ అందించిన మాస్టర్ కృష్ణను అభినందించారు. కార్యక్రమంలో కరాటే బెల్ట్‌ల చీఫ్ ఎగ్జామినర్, 8వ బ్లాక్ బెల్టు డాన్ ఎండీ ఖాజాపాషా, ఆర్గనైజర్లు బ్లాక్ బెల్టు డాన్‌లు జంగయ్య, రాములు, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కరాటే మాస్టర్లు, నాయకులు

పొంచి ఉన్న ప్రమాదం!

- ఇళ్లపై నుంచి 11కేవీ విద్యుత్ లైన్
- భయాందోళనలో 30 కుటుంబాలు
- లైన్ మార్చాలంటూ గ్రామస్తుల వినతి

కేశంపేట: ఇళ్లపై నుంచి హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలోని ఎల్లమ్మ గడ్డలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గ్రామంలో నిరుపేదలను గుర్తించి ఇంటి స్థలాలతో పాటుగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందించింది. కొన్నేళ్ల క్రితం ఈ కాలనీలో ఇందిరమ్మ ఇళ్లపై నుంచి 11కిలో ఓల్ట్ (కేవీ) హైటెన్షన్ విద్యుత్ లైన్ వేశారు. ఈ విషయంపై గత ప్రభుత్వ హయాంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. హైటెన్షన్ విద్యుత్ వైర్ల కారణంగా ఇంటిపైకి వెళ్లలేకపోతున్నామని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఎన్ని ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్తులు హైటెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. తీగలను వేరేచోటకు మార్చాలని గ్రామస్తులు వినతిపత్రంలో కోరారు. ఎమ్మెల్యే ఈ విషయాన్ని పట్టించుకొని విద్యుత్‌లైన్‌ను మార్చాలను కోరుతున్నారు.



ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు

లైన్‌ను మార్చండి

ఇళ్లపై నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి విద్యుత్ లైన్‌ను వేరేచోటకు మార్చాలి. ఎవరికీ ఇబ్బందులు లేకుండా మరో మార్గంలో విద్యుత్ లైన్ వేసే విధంగా ఏర్పాట్లు చేయాలి.

–అబ్బి సుందరయ్య, మాజీ ఉపసర్పంచ్, పాపిరెడ్డిగూడ